# రక్షించా

రోహిణీకార్తె ఎండ నిప్పులు చెరుగుతోంది. భోంచేసి ఓ కునుకు తీసే ప్రయత్నంలో ఉన్నాడు ప్లీడరు నీలకంఠం. వీధితలుపు ఎవరో దడ దడ కొడ్తున్నారు. "ఎవరా యముడు బాబూ" అని విసుగుతో తలుపు తెరిచాడు.

ఎదురుగుండా రామారావు. కాళ్ళకి చెప్పులులేవు. గొడుగు తేనేలేదు. శుష్కించిన మొహం, మాసిన గడ్డం, మురికి గుడ్డలూ, నీలకంఠం తలుపు తెరవగానే చటాలున లోపలికివచ్చి బావురుమని ఏడ్చాడు.

"ఏమిటి రామం ? లోపలికి పద" అంటూ రామారావుని నీలకంఠం లోపలిగదిలోకి తీసుకెళ్ళాడు. పడక కుర్చీలో రామాన్ని కూలేసి, టేబుల్ ఫాన్ తిప్పి, కాసిని చల్లనినీళ్ళిచ్చాక రామం కొద్దిగా తెప్పరిల్లాడు. రెండు చేతుల్లోను ముఖం దాచుకు వెక్కి వెక్కి నిస్సహాయంగా ఏడుస్తున్నాడు.

అసలు సంగతేమిటని సముదాయిస్తూ అడిగాడు నీలకంఠం.

నీలకంఠానికి రామారావుకీ క్లబ్‌లో స్నేహం అయింది. నీలకంఠం రామారావుకంటె ఒకదశ పెద్ద. కాని వీరి స్నేహం విచిత్రంగా కలిసింది. అందరూ పేకాడుతూంటే వీరు పిచ్చాపాటీ చెప్పుకునేవారు. నీలకంఠం గొప్ప హృదయంగల మనిషిగా రామారావుకి మొదటినుంచీ కనిపించాడు. అందుకే తలమునిగే యీ ఆపదలో ఇక్కడికి వచ్చాడు. ఈమధ్య రెండు నెలలనుంచీ రామారావు నీలకంఠానికి కనపడటంలేదు.

అరిచేతుల్లో ముఖందాచుకు రామం అలాగే కూచున్నాడు. నీలకంఠం రామం భుజంమీద చెయ్యేసి "ఏం జరిగిందో చెప్పు. అలా దిగాలుగా కూచుంటే ఎలా ?" అన్నాడు నెమ్మదిగా.

"జానకిని చంపేశాను. ఎందుకూ కొరగాని వెధవని నేను. స్వర్గసీమ చూపించిన స్త్రీమూర్తిని బలిపెట్టాను. నా జానకిలేదు. చేతులారా చంపేశాను. నా పాపానికి పరిహారంలేదు" అంటూ మళ్లీ ఏడుపు మొదలెట్టాడు.

"జానకెవరు ? నువ్వెందుకు చంపావు ?" అని ఆదుర్దాతో ప్రశ్నించాడు నీలకంఠం.

మరోగ్లాసు చల్లటి మంచినీళ్ళుతాగి రామారావు మొదలెట్టాడు కథ.

...............

"మా నాన్న దౌర్భాగ్యపు పనివల్ల ఇంత ముప్పు వచ్చింది...అసలు మాది మద్దేపల్లి. మాకు యాభై ఎకరాల మాగాణీ ఉండేది. ఊళ్ళో మా నాన్న పేరు మోగిన పెద్దమనిషి. అద్దాల మేడ ఉండేది మాకు. చుట్టూ పెద్ద తోట. ఎంత బాగుండేది ! మా తోటలోలేని పువ్వూ దొరకని పండ్లూ ఉండేవా ? దొడ్లో దిగుడు బావికి బోరింగ్ పెట్టించి తోటలోకి నాలుగు పంపులు పెట్టారు నాన్న.

సంపంగి రోజా గంపెడు పూలు పూసేది. తోట చుట్టూ కొబ్బరి చెట్లు. ఎన్ని చెట్లని ? మాఅమ్మ ఆ కొబ్బరికాయలమ్మి కాసులుపేరూ వడ్డాణం చేయించుకుందిట.

నడి వేసవిలోకూడా రెండావులూ రెండు గేదెలూ పాడి. నాన్న తెల్లారిగట్ల నాలుగింటికి లేచేవారు. పాలేర్ని వెంటబెట్టుకు గొడ్ల సావిడిలో పాలు పిండించి బయటకొచ్చే వేళకి ఆరు కొట్టేవారు. పాలేరు పాలు పిండుతూంటే నాన్న తెలకపిండీ, తవుడూ, కుడితీ ఇలాంటివి చూసుకుని, అప్పలమ్మచేత గొడ్ల సావిడి తుడిపించేవారు.

ఆరింటికల్లా 'రాముడూ' అంటూ నన్ను లేపేవారు. ఇద్దరం నూతి దగ్గిరకి స్నానానికి వెళ్ళే వాళ్లం! నాన్న అధమం ఒక వంద చేదలన్నా గుమ్మరించుకునేవారు, సూర్యోదయం అయేదాకా 'హర హర మహాదేవ శంభో శంకర' అని స్మరిస్తూ స్నానం చేసేవారు. పిడుగులుపడ్డా, నీళ్ళు గడ్డగట్టే చలికాలమైనా యీ నిత్యకృత్యం మానేదికాదు. 'కుర్రాడికి ఆ చన్నీళ్ళేమిటని అమ్మ గోలపెట్టేది, కాని నాన్న 'మనమేం బస్తీవాళ్లమా వేడినీళ్ళకి. నా కొడుకు నాకు మల్లేనే వొళ్ళొంచి బతకాలి. వాడికి నాజూకులు చెప్పకు' అని తిట్టేవారు. అమ్మ కిక్కురుమనేది కాదు.

ఏడున్నరకి సంధ్యావందనం ముగించుకుని మరగ కాచిన ఆవుపాలు ఒక శేరు తాగేవారు. ఆయన తోటలోకి, నేను బళ్ళోకి వెళ్ళేవాళ్ళం. ఎనిమిదింటినుంచీ తోటలో చెట్లకి బోదులు చెయ్యడం, తుడిపించడం, యింట్లో కూరకి చెట్లనుంచి కాయలు కొయ్యడం ఇలా పదింటిదాకా పనివాళ్ళతో తాపత్రయ పడేవారు.

నాన్న ఆ ఊళ్ళో శివాలయం కట్టించారు. ఆలయానికి ఏడెకరాలు రాశారు. తోటలోంచి రాగానే మళ్ళా శిరస్నానంచేసి, శివాలయానికి వెళ్ళి పూజా పునస్కారాలు ముగించుకుని, రెండు జాములకి ఇంటికొచ్చి, మళ్ళీ స్నానం, సంధ్యా, భోజనం ముగించే వేళకి ఒంటిగంట కొట్టేవారు. మా తోటకి తూర్పు దిక్కుగా తమలపాకులతీగె వుండేది. అమ్మ పాందానితో ఆ సమయానికి తమలపాకుల తీగెదగ్గిర కొచ్చేది. నాన్న ప్రత్యేకంగా ఆ తీగె పక్కన ఒక గచ్చరుగు కట్టించారు. దానిమీద కూచుని అప్పటి కప్పుడు తీగెనుంచి ఆకులు తుంచి పక్కా గంటసేపు తాంబూలం సేవించే వారు. మధ్యాహ్నం మూడున్నరదాకా నిద్ర.

మాది చిన్న పల్లెకావడంవల్ల, అందులో మా నాన్న డబ్బూ నిష్ఠా వున్న మనిషి కావడంవల్ల ఊళ్ళో అందరికీ యాయనంటే భక్తీ గౌరవా లుండేవి. ప్రతిరోజూ నాలుగునుంచి ఆరింటిదాకా మా ఇంట్లో పురాణ కాలక్షేపం జరిగేది. లేకపోతే రాత్రివేళ రామనామ భజనో, పాండురంగ భజనో వుండేది. ఊళ్ళో అందరికీ తల్లో నాలికలా మెలిగేవారు నాన్న.

అమ్మకు నాకుముందు నలుగురు పిల్లలు పుట్టి చచ్చిపోయారు. నేను అయిదో కానుపుకి పుట్టాను. నా తర్వాత సంతానం కలగలేదు. అమ్మ నన్ను కింద పడవనిచ్చేదికాదు. నా పుటకలకి అమ్మకు చాలా జబ్బుచేసి చచ్చి బతికిందట. అప్పుడే అమ్మకు వుబ్బసం పట్టుకుంది. నాన్న మటుకు యినప కడ్డీలా దృఢంగా వుండేవారు. కాని అమ్మ సడలిపో నారంభించింది. పక్క పట్నం హైస్కూల్లో చదువు మొదలు పెట్టాను. ప్రతి ఉదయం వెళ్ళి సాయంత్రం తిరిగి వస్తూండేవాణ్ణి. నేను హైస్కూల్లోజేరడం, నాన్న షష్టిపూర్తి చేసుకోడం ఒకేసారి జరిగాయి.

ఇంటర్ పాసై, థర్డియర్‌లో ప్రవేశించాను. అమ్మకి పెద్ద జబ్బు చేసింది. బతకదనుకున్నాం. ఎలాగైతేనేం నెమ్మదించింది. డాక్టరు గారి

మార్పు అవసరం అన్నాడు. సముద్రపు గాలైతే మరీ మంచిదన్నాడు. నేనెల్లాగా విశాఖపట్నంలో హాస్టల్లోవుండి చదువుతున్నా నాయను, అక్కడే కాపరంపెట్టి అమ్మను తీసుకొస్తే మంచిదని నిశ్చయించుకున్నాం. నాన్నకి ఊరు మారడం ఇష్టంలేదు కాని ఏంచేస్తారు, అమ్మకి ప్రాణాలమీద కొచ్చి నప్పుడు? సముద్రానికి దగ్గరగా ఒక మేడ అద్దెకు తీసుకున్నాం. అమ్మా-నాన్న, నేను. పూర్వ సువాసినిని వంటకి కుదుర్చుకున్నాం. అప్పటికి అమ్మకి ఏభైఅయిదు-నాన్నకి అరవైఏడు వయసు.

అప్పుడే చెట్టునుంచి కోసిన కూరలు, చిక్కని పాలు, కమ్మని పెరుగు, చిల్లేసిన నెయ్యి, అరసోలెడు పప్పూ, అర్ధశేరు అన్నం తిని, గోడ్లనీ, దొడ్లనీ, తోటలనీ, దేవుడనీ, తిరిగే నాన్నకి యీ పట్నంలో అమాంతం పడేసే వేళకి ఆయన తట్టుకోలేకపోయారు, నాన్నకి కాలక్షేపం అవడమే కష్టంగా ఉండేది. పగలల్లా అమ్మ పక్కమీద ఉండేది. నేను కాలేజీలో గడిపేవాణ్ణి. గోళ్ళు గిల్లుకుంటూ కూచోటం అంటే నాన్నకి ప్రాణసంకటంగా ఉండేది.

కాలక్షేపానికని రోజూ ఉదయం బజారుకీ, సాయంత్రం బీచికీ వెళ్తూండేవారు నాన్న. అమ్మ రోజులు లెక్కపెడుతోంది. సినిమా అంటే ఎలా ఉంటుందో తెలియని నాన్న ఒకరోజున సినిమాకి వెళ్ళి వచ్చారు. సినిమాలంటే నాన్నకి పరమ అసహ్యం. ముక్తా మోక్షమా అని యీసడించే నాన్న ఎలా కూచో కలిగారక్కడ? మునసబుని మా ఇంటి చావిడిలో చుట్ట కాల్చనియ్యని నాన్న ఆ సిగరెట్టు వాసన ఎలా భరించగలిగారు?

నీరికావి బట్టా, పట్టు శాలువా తప్ప మరో రకం బట్టలెరగని నాన్న ఒకనాడు బజారుకెళ్ళి కలకత్తా అంచు పంచెలు, పాప్లిన్ చొక్కాలూ కుట్టించుకొచ్చారు. ఆనాడు రహస్యంగా ఏడ్చాను నేను.

సహస్ర గాయత్రి చెయ్యందే పాలు ముట్టని నాన్న రోజూ ఉదయానే కాఫీ తాగిగాని మరోపని ముట్టడం మానేశారు. క్రమంగా సంధ్యావందనం ఎగిరి పోయింది. ఒకనాడు బజారమ్మట వస్తూ - నాన్న కాఫీ హోటలునుంచి బయటకు రావడం చూసి ఆయన పతనానికి జాలిపడ్డాను.

పట్నవాసం మా కొంప కూల్చింది.

ఆ సాయంత్రం అమ్మకి దగ్గు తెరలు తెరలుగా వస్తోంది. ఆరయింది నేను ట్యూటరింటికి వెళ్లాల్సివుండి నాన్నతో చెప్పి పోదామని మేడమీద కెళ్ళాను.

నాన్న గది తలుపు తెరుచుకుని వంటమనిషి బయటకొస్తోంది. చీమలూ, జెర్రులూ పాకినట్టుగుంది. జన్మంతా తన సేవతో గడిపిన అమ్మ వరుగులా పక్కకంటుకుపోతే నాన్నకీ బుద్ధేమిటి? ఎవరితో చెప్పుకోను? అమ్మ పుట్టెడు జబ్బుతో ఉంది. అమ్మ ముఖంచూసి ఆ యింట్లో ఉంటున్నాను. ఆ రోజునుంచి నాన్న ముఖం చూడటానికి అసహ్యం వేసేది.

మరో మూడు నెలలు గడిచాయి. నాన్నలో రాక్షసమార్పులు కలుగుతున్నాయి. సన్న పంచెలు, పిలకకి బదులు సమ్మర్ క్రాఫ్, నిత్యం సినిమాలు ఆయన దగ్గిరెప్పుడూ సెంటువాసన గుప్పు మనేది.

ఈ ఆరు నెలల్లో దేముడనేవాడు ఒకడున్నాడనీ అతగాడికి తనో శివాలయం గట్టించాననీ, ఆయన హాయిగా మర్చిపోయారు.

అమ్మ పోయింది. నాన్న తిరిగి స్వగ్రామం వెళ్ళిపోతారనుకున్నాను. అమ్మ పోయిన యిరవయ్యోనాడు మాటవరసకి ఆ సంగతి ప్రస్తావించాను కూడా నాన్నతో. "అక్కడయినా వంటమనిషే - ఇక్కడయినా వంటమనిషే. ఎక్కడయితే నేం?" అన్నారు. నేను నోరు నొక్కుకుని ఊరుకున్నాను.

అమ్మ పోయిన మరుసటి నెలలో మా ఊళ్ళోని ఇల్లూ, తోటా అమ్మేశారు నాన్న. మా గ్రామంలో యిల్లమ్మటం నాకు సుతరామూ ఇష్టంలేదు. పట్నం వచ్చి, కాలేజీలో చేరిన తరువాత యీ ఇరుకు సందులూ మనుషుల రొదలూ విని విసుగెత్తిన నాకు మా ఇల్లు దేవేంద్ర భవనంలాగే తోచేది. వేసంగి శలవలు రెండు నెలలూ ఆ ఇంట్లో ఎంతో చల్లగా ఉండేది. ఆ చల్లదనం ఇంక లేకుండా చేశారు నాన్న. రాత్రి భోజనాలైన తర్వాత వంటావిడ నదురూ బెదురూ లేకుండా నాన్న గదిలోకి వెళ్ళి పడుకునేది. ఈ అన్యాయానికి నా గుండె దద్దరిల్లిపోయేది. కాని ఏం చేస్తాను?

ఒకనాటి ఉదయం నిద్దర లేవడం ఆలస్యమయింది. నా గదిలోకి పెద్ద కేకలు వినిపిస్తున్నాయి. "మహాలక్ష్మిలాంటి పెళ్ళాం చచ్చిపోయి

ఆరు నెలలు కాలేదు, ఊరుమీద పడ్డాడు. వీళ్ళ ముందుకీ, బుద్ధి వెనక్కీ పోతోందా?" అంటోంది చాకలిది. ఆనాడు ఎంత సిగ్గుపడ్డాను! ఆమాట చాకలిది నన్నే అంటున్నట్టు బాధ పడ్డాను నలుగురూ వింటే అప్రతిష్ట. నన్ను చూసి నాన్న తప్పుకు వెళ్ళిపోయారు. చాకలిదానికి నెమ్మది మాటలు చెప్పి చేతిలో పదిరూపాయలు పెట్టి పంపాను. నాన్న నైతిక పతనం వ్యాధిలాంటిది చాలా జాలేసింది. కాని ఇంక యీ చెలగాటానికి అంతం? ఆ మూడో రోజున ఇనప్పెట్లోంచి రెండువేల రూపాయలు అపహరించి లోకంలోకి పారిపోయాను. నరకకూపంలాంటి మాఇల్లు వదలి పరిశుభ్రమయిన గాలి పీల్చేందుకు ప్రపంచంలోకి అడుగెట్టాను. కొడుకుని దారిలో పెట్టాల్సిన తండ్రే దారితప్పి నడుస్తూంటే కర్తవ్యం?

బొంబాయి వెళ్లి నాపొట్ట నేను పోసుకోడం మొదలెట్టి మూడు నెలలైనా తిరక్కుండా మా నాన్న పెళ్ళి చేసుకున్నాడనే వార్త తెలిసినవాళ్ళెవరో నా చెవిని వేశారు. మొదట్లో నమ్మలేను, డెబ్భయిలో ప్రవేశించబోతున్న నాన్న ఆపని చేస్తారని నేను కలలోకూడా అనుకోలేను. పెళ్ళిచేసుకున్నది పంటమనిషిని మాత్రం కాదని చెప్పారు ఆ వార్త చెప్పినవాళ్ళు. ఏ వితంతువునో కాలక్షేపం కోసం పెళ్ళి చేసుకు ఉంటాడనుకున్నాను.

మరో ఏడాది గడిచింది. నాన్నకి పక్షవాతం అనీ, చావు బతుకుల్లో ఉన్నాడనీ, ఆస్తి అన్యాక్రాంతం కాగలదనీ మా అమ్మ తాలూకు బంధువొకాయన ఉత్తరం రాశాడు. కష్టపడి సంపాయించిన ఉద్యోగం వదిలేందుకు మనసు ఒప్పలేదు. ఈ ఏడాదిన్నరా దూరంగా ఉండటంవల్ల నాన్న తప్పులెన్నో క్షమించగలిగాను. కన్న కొడుకుగూడా కాఠిన్యం వహిస్తే ముసలాయన గతేంగాను? చూస్తూ చూస్తూ ఏభై ఎకరాల ఆస్తి వదలబుద్ధి వేస్తుందా? ఉద్యోగానికి తిలోదకాలిచ్చి వైజాగ్‌కి ప్రయాణం కట్టాను.

ఎప్పటికిమల్లేనే మెయిలు లేటు విశాఖపట్నం వెళ్ళేవేళకి దీపాలు పెట్టారు. మా పిన్ని ఎలా వుంటుందో? సవతి తల్లులు చాలా దుర్మార్గంగా ఉంటారంటారు.

సావిట్లో పడక కుర్చీలో పదిహేడేళ్ళ అమ్మాయి ఒకతె ఏదో చదువుకుంటోంది. నాన్న పక్క గదిలో వుండి ఉంటారు. ఎవరో చుట్టం కాబోలు!

నా రాక సూచించేందుకు దగ్గాను. ఆ అమ్మాయి తలెత్తి చూచింది, చామన ఛాయ-చురుకైన కళ్ళు.

"ఎవరికోసం?" అంది.

"నరసింహ శాస్త్రుల్ల గారబ్బాయిని, రామారావుని" అన్నాను.

"ఆ" అంటూ దెబ్బతిన్నట్టు వుబ్బెత్తుగా కుర్చీలోంచి లేచింది.

పరిస్థితి తమాషాగా ఉంది. ఆమె ఎవరు? లోపలికెళ్లి పిన్నిని పిలవదేం? అలా తేరిపార చూస్తుందేం?

"నాన్నగారికి ఎలా ఉంది? జబ్బుగా ఉందని విని వచ్చాను. ఇంట్లో ఇంకెవరూ లేరా?" అన్నాను ఇబ్బందిగా.

"పక్షవాతం. పెద్దతనం మాట పడిపోయింది. ఇంట్లో వంటావిడ వుంది."

ఈవిడేనా మా పిన్ని. అరె! మా నాన్న యింత చిన్నపిల్లని కట్టుకున్నాడా? ఘోరం-యిది దురన్యాయం. వృద్ధాప్యంలో సేవచేసేందుకు మనిషే అవసరమయితే ఒక నర్సుని కుదుర్చుకోలేకపోయాడా? ఈ పిల్ల గొంతుక్కోశాడా?

"ఆయన ఆ గదిలో వున్నారు" అంటూ లోపలికి వెళ్ళిపోయింది. ఆ అమ్మాయి.

ఏణ్ణర్థంలో నాన్న చాలా మారిపోయారు. వార్ధక్యం ఆయన్ని పూర్తిగా ఆవరించుకుంది. కుడిభాగం పక్షవాతంతో పడిపోయింది. నోట మాటలేదు. కళ్ళు-ఆ కళ్లు మటుకు తన చుట్టూ తిరిగే మనుషుల్ని గుచ్చి గుచ్చి చూస్తున్నాయి. ఆ కళ్ళను చూస్తే ఓపక్క జాలి, ఓపక్క అసహ్యం పుడుతోంది. ఎక్కడి తండ్రి ఎక్కడికొచ్చారు? "శంభుని శిరంబందుండి-పవనాంధోలోకానికి"-నన్ను చూడగానే ఆయన కంటిలోకన్నీరు తిరిగింది. కాని ఏం లాభం? పట్నంవచ్చి తన పవిత్ర జీవితాన్ని ధ్వంసం చేసుకున్నారు.

ఆ రాత్రి భోజనాలయాక మేడమీద కూచున్నాం పిన్నీ నేనూ. పిన్ని తనను "జానకి" అని పిలవమంది. లోకపు విలువలో ఎంతవ్యత్యాసం! మా నాన్న తనపీకకోశాడని జానకి పొరబాటునకూడా అనుకోలేదు. వెనకటి

కంటే యిప్పుడే సుఖంగా ఉందట. కడుపునిండా తిండి, శుభ్రమైనబట్టలు, ప్రేమతో చూసే ముసలి మొగుడు–వీటికే తృప్తిపడి తను అదృష్టవంతురాలనని మురుస్తోంది జానకి

జానకికి తల్లీ తండ్రీ లేరు. మేనమామ పెంచాడు. నేను ఇల్లు వదలి వెళ్లిన మూడు నెలలలో నాన్న జానకిని మూడువేలు పోసి కొన్నారుట. జానకి ఎనిమిదో క్లాసుదాకా చదివింది. అక్కడ మేనమామా, అత్తా పెట్టే యమచర కంటే యీ ముసలి భర్తే నయం–అంది జానకి.

మొట్టమొదట నేను ఊహించిన సవితితల్లి పులిపిల్ల లాంటిది. కాని నేను ఎదురుగుండా చూస్తున్న యీ పిన్ని లేడిపిల్ల. బంగారులేడి.

"ఈ యిల్లూ, డబ్బూ ఎలా జాగ్రత పెట్టాలా అని భయంపట్టు కుంది. వేళకి వచ్చావు" అంది జానకి.

ఆమెకి అఖండ తెలివి తేటలు లేకపోయినా లోకపు మంచీ చెడ్డా తెలుసు.

"ఉన్న పరిస్థితి యిది. మీ నాన్న ఇంకెన్నాళ్లో బతకరన్నాడు డాక్టరు. సందు దొరికితే మా మామా; అత్తావచ్చి నాతల గొరిగించి అన్నీ పట్టుకెళ్దామని కాచుకూర్చున్నారు. నా పాలిట దేవుడిలా వచ్చావు సమయానికి. ఇంక నిన్ను వెళ్ళనివ్వను. మామా అత్తా వస్తే వాళ్లని వీధిలోకి తరమాల్సిన భారం నీది. వాళ్ళని నమ్మేబదులు కసాయివాడిని నమ్మితేమేలు నిన్ను నమ్మాను. నన్ను అన్యాయం చెయ్యవుగదూ ?" అంటూ నిశ్చింతగా తాళాలు నా చేతిలో పెట్టింది.

....................

"అంతే జానకి నన్ను నమ్మింది. నేను కిరాతకుణ్ణి. తాళాలు తీసుకున్న యీ చేతుల్తోనే నా జానకి ప్రాణాలు తీశాను" అంటూ మళ్లీ ఏడుస్తున్నాడు రామం.

"పూర్తిచెయ్యి" అన్నాడు నీలకంఠం.

....................

"చిన్నప్పటినుంచీ నేను వొంటివాణ్ణి గావడంవల్ల తల్లి ప్రేమతప్ప మరో స్త్రీ హృదయం ఎరగను. ఆ క్షణాన్నే జానకికి నేను–నాకు జానకి

దిక్కని నిశ్చయం అయింది. ఒక్క గంటలో యుగయుగాల నాటి స్నేహితుల్లా దగ్గిరగా వచ్చాం ఇద్దరిదీ ఒకే మాటగా ప్రవర్తించేవాళ్ళం. నాన్నగారు కళ్ళతో తను చేసిన పాపానికి ఫలితం చూస్తూ కుమిలిపోయేవారు.

వచ్చిన పదిరోజులదాకా జానకికి నామీదా—నాకు జానకిమీదా ఎటువంటి దురభిప్రాయమూ కలగలేదు. ఇద్దరం మా స్థానాలు తెలుసుకు మసులుతుండే వాళ్ళం. జానకి నా పట్ల ఎంతో శ్రద్ధచూపేది. నాకు కావ కావలసిన పనులు క్షణంలో చేసేది. ఆఖరికి నే నే బట్టలు వేసుకోవల్సిందీ ఆమె చెపుతూండేది. నా రాకవల్ల జానకి జీవితంలో కదలికా వికాసం ప్రవేశించాయి. నే చదివిన కథలూ—చూసిన సినిమాలూ చెప్తూంటే ఉత్సాహంగా వినేది.

నేను రాకమునుపు జానకి వంటావిడ కొంగు పుచ్చుకు తిరుగుతూ, ఆమె చెప్పినట్లు నడుచుకునేది. నా రాకతో జానకికి ధైర్యం కలిగింది. వంటావిడ పగలూ రాత్రీ మా యింట్లోనే ఉండేది. రాత్రిళ్ళు జానకికీ, నాన్నకీ సాయంగా పడుకునేది. నే వచ్చినప్పటినుంచీ జానకికూడా మేడమీదే పడుకోడం మొదలెట్టింది. ఈ పద్ధతి వంటావిడకు నచ్చలేదు. మొదట్లో మే మావిడమాటలు లెఖ్ఖచెయ్యలేదు. లోకులు కాకులు అని ఊరుకున్నాం. డబ్బిస్తున్నాం కనక ఆమె వండిపెడ్తోంది. అంతవరకే కాని మా నడతగురించి ఆబిడ మాట్లాడటం మాకు హితవుగాలేదు. మాలో చెడు లేనంతసేపూ యీవిడ ఏమంటె మాకేం?

సూటీపోటీగా అనే వంటావిడ మాటలూ, తినేసేట్టుచూసే నాన్న కళ్ళూ జానకి కాళ్ళక్రింద మంటలు పెట్టాయి. ఆనాడు తెగించి సినిమాకు బయల్దేరింది. అప్పటివరకూ ఇంట్లో నాతో ఖబుర్లాడటమేగాని వీధిలోకి ఎప్పుడూరాలేదు. నా తండ్రి కళ్ళనీ, వంటావిడ మాటల్నీ తప్పించుకునేందుకు జానకి మొండి సాహసం చూపింది. ఇంటికొచ్చే వేళకి నాన్న మమ్మల్ని తినేసేట్టు చూశారు.

భోజనం వడ్డిస్తూ వంటావిడ "పనిలోంచి మానేస్తాను. రేపు వెళ్ళిపోతాను. మరో మనిషిని చూసుకోండి" అంది. జానకి బిత్తరపోయి నావంక చూసింది.

"కారణం ?" అన్నాను.

"చావు బతుకుల్లోవున్న ముసలాణ్ణి పెట్టుకు యీ లంకంత కొంపలో నే వుండలేను, బాబూ! మీరిద్దరూ హాయిగా తిరుగుతూంటారు. తండ్రని నీకూలేదు, తాళికట్టాడని ఆవిడకూలేదు. మధ్య నాకా ఏమిటి చుట్టం? నే వెళ్తాను" అని సాగదీసింది.

వంటావిడను లాగి లెంపకాయ కొడదామన్నంత కోపంవచ్చింది. కాని తమాయించుకున్నాను. వంటావిడ నిలవజేసుకున్న రెండువేలూ ఎక్కడివి? నాన్నసొమ్ము కాదూ అది? యిలాంటివి పైకి తేగూడదు. అది సమయంకాదు.

ఆ రాత్రి మరీ అధైర్యపడిపోయింది జానకి. "ఆఖరికి నేను కడుపు నిండా తినడంకూడా మనుషులకు గిట్టదు. ముసలివాళ్ళకిరాక మృత్యువు మనకొస్తుందా? చూడు ఎన్ని మాటలందో? మరో పదిస్తే ఉంటుందేమో? ఆవిడ వెళ్ళిపోతే ఎలా?"

"మరో వంటావిడ వస్తుంది."

"రాత్రిళ్ళు ఆయనదగ్గిర కనిపెట్టుకుని ఉండేందుకు ఎవరూ వొప్పరు అదీ వచ్చిన తిప్పలు. రాత్రిళ్లు నే నొక్కదాన్నీ పడుకోలేను. భయం వేస్తుంది. మొదటినుంచీ నా బతుకు ఇలాగేవుంది. చిన్నప్పటినుంచీ ఆలనా పాలనా లేక బతికాను, యీ ఇంట్లోకొచ్చి పడ్డాను. ఆయన పక్కమీద పడేదాకా, నావంక ఎవరేనా చూస్తారేమోనన్న అనుమానంతో కట్టుదిట్టం చేశారు. పక్కమీద పడ్డప్పటినుంచీ ఆయన పక్కకు కాపలా? 'అయ్యో' అన్నవాళ్ళు ఒక్కరులేరు. డబ్బిచ్చుకు వూడిగం చేసేదానికికూడా లోకువే నేను. చూడు-ఎంత లేసి మాటలందో! ఏ పాపం ఎరగని మనకు నీతులు చెప్తోంది. వెధవబతుకు-తిట్లతో నే నూరేళ్లూ నిండేట్టుంది" అని కంటతడి పెట్టింది.

జానక్ ఎందుకిలా కుంగిపోవాలి? నేనులేనూ? దగ్గిరకుతీసి ధైర్యం చెపుతూ తల నిమురుతున్నాను. సాయంత్రం జానకి జడలో తురుముకున్న జాజులు గుప్ మన్నాయి. వెచ్చగావున్న ఆమె శరీరం నాశరీరానికి తాకింది నాకు తెలియకుండా ఊరడించే నా కంఠం లాలించింది. అనుకోకుండా నా పెదిమ లామె పెదిమల్ని వెతికాయి. నా చేతులామె నడుంచుట్టాయి. జానకి నా కౌగిలిలో కరిగిపోయింది. వంటావిడ మాట "తథాస్తు"అయింది.

తెల్లవారి నే లేచే వేళకి జానకి ఇంకా నిద్రపోతూనే వుంది. మూసిన ఆమె కనురెప్పలు నన్ను మురిపించాయి. కనురెప్పల్ని చుంబించే నా ముఖాన్ని తన రెండు చేతుల్లో యిముడ్చుకుని "రామూ" అంది జానకి. ఆ తియ్యటి ముఖం మృత్యుసన్నిధిలోనైనా మర్చిపోగలనా?

మర్నాటి సాయంత్రం బీచిలో కూచుని రాత్రి జరిగిన సంగతి తప్పా-రైటా అని నాలో నేను తర్కంలో పడ్డాను. సాంఘికంగా మా ప్రవర్తన తప్పు. మహా పాపం; ఒకపక్క చావుబతుకుల్లో వున్న తండ్రి, మరోపక్క మాతృసమానురాలు జానకి. కాని మేము యిలాంటి పరిస్థితుల్లోకి వచ్చేందుకు కారణభూతులెవరు?-అని ప్రశ్నించుకున్నాను. ఈ పరిస్థితులకి కారణం మా తండ్రి. అసలు మాలో యీ నైతిక పతనం ఎందుకొచ్చింది? దీనికి అంతం ఎక్కడ? ఈ సాలె గూటిలోంచి పిరికిపందలా పారిపోతే ఎలా? నిన్నటిదాకా వున్న స్థితిగతులు వేరు. తెల్లవారిన తర్వాత వేరు. పారిపోయినా, పగలూ రాత్రీ జానకి ముఖం నన్ను వెన్నాడదూ? ఊబిలో కూరుకుపోయాను. అన్నీ ప్రశ్నలే. బుర్ర గిర్రున తిరుగుతోంది. జానకి కావాలని ఆత్మ, శరీరం పెద్ద పెట్టున గోల పెట్టాయి.

ఇంటిదారి పట్టాను. జానకి ఏం పాచిక వేసిందో! వంటావిడ మళ్ళీ నవ్వుతూ ఉండిపోయింది. జానకి తల్లో జాజులు మరీ వత్తుగా తురుముకుంది. జానకీ వంటావిడా కలిసి, ఆ రాత్రి నేను ఆలస్యంగా వచ్చినందుకు సతాయించారు. నాలో నేను నవ్వుకున్నాను.

ఆ రాత్రి జానకి నన్ను ఎక్కడికో, ఎక్కడెక్కడికో తీసుకుపోయింది. ఇంక ఆలోచనలు అనవసరం. జానకికి నేనూ-నాకు జానకీ.

నెల తిరక్కుండా నాన్న చచ్చిపోయారు జానకీ నేనూ ఒకరికొకరం పెనవేసుకుపోయాం. జీవితంలోని మాధుర్యాన్నంతా నా పెదాలికి అందించింది జానకి. పదోనాడు ఆమె మేనమామ వచ్చాడు. జానకి నా ఆసరాతో వాళ్ళని గుమ్మం తొక్కనివ్వలేదు.

నాలుగు నెలలూ నాలుగు క్షణాల్లా గడిచిపోయాయి. లేడిలా గంతే జానకి నలతగావుండటం మొదలెట్టింది. రాత్రిళ్ళు ఉలిక్కిపడి లేస్తూండేది. ఒక్కొక్కనాడు నిద్దర్లో ఏడ్చేది. ఒకనాడు నిలవదీసి అడిగాను.

స్త్రీ, పురుషుడిలా గాలిలో స్వేచ్ఛగా ఎగరలేదనీ, ఎగిరినా ప్రకృతి స్త్రీని కఠినంగా శిక్షిస్తుందనీ జానకి సమాధానం యిచ్చింది.

మర్నాడు డాక్టరు దగ్గిరకెళ్ళి రెండొందలు లంచంబెట్టి మందు తెచ్చి యిచ్చాను. కిరాతకుణ్ణి. ఈ చేతుల్తో నన్ను నమ్మిన జానకికి మందిచ్చాను.

అనుకున్నమాదిరి మందు పనిచెయ్యలేదు. జానకికి వాతం నుంచు కొచ్చింది. నాలుగు రోజులు నిస్సహాయంగా పక్షిలా గిలగిల కొట్టుకుంది. లాభం లేకపోయింది. మందు వికటించింది. ఎవరూ రక్షించలేకపోయారు.

ఆ కళ్లు ఆఖరిక్షణందాకా నన్ను చూస్తూ "జాగ్రత్త రామూ-వున్నన్నాళ్లూ హాయిగా బతికి-వున్న అమృతాన్ని తాగి వెళ్ళిపోతున్నాను. మిగిలింది గరళం-జాగ్రత్త" అంటూ చనిపోయింది జానకి. తెల్లారిగట్ల అయిదింటికి పోయింది."

............

"శవాన్ని ఏం చేశావ్ ?" అన్నాడు ప్లీడరు ఆదుర్దాగా.

"శవం ఏమిటి. నా జానకి శవమా ?" అన్నాడు రామం మతిపోయిన వాడిలా.

"ఏడిచినట్టే వుంది. దహనం జరిగిందా ?

"దహనమా ? పక్కమీద హాయిగా నిద్రోతూంటే! తాళంబెట్టి యిలా వచ్చాను" అన్నాడు రామం.

నీలకంఠం నిర్ఘాంతపోయాడు. రామానికి అపాయం తెలియడంలేదు,

"ఇంట్లో వంటమనిషిలేదా ?" అన్నాడు లాయరు ధోరణిలో నీలకంఠం.

"లేకేం. నిన్నల్లా జానకి దగ్గరే వుందావిడ."

"వంటావిడకు అంతా తెలుసా ?"

"ఆ"

"చుట్టపక్కల ఎవరికన్నా యీ సంగతి తెలుసా ?"

"స్వతహాగా జానకి మితభాషిణి. పాన్నపోయిన నాటినుంచి చుట్టు పక్కల వాళ్ళని తప్పించుకు తిరుగుతోంది. ఏ పుట్టలో ఏ పాముందో నాకు మాత్రం ఎలా తెలుసు ?"

నీలకంఠం సమాధానం చెప్పలేదు. ఆలోచనలోపడ్డాడు. రామం తిన్నగా వెళ్ళి పులిబోనులో చిక్కుకున్నాడు. అతన్ని తప్పించడం సాధ్యం

అయే పని కాదు. పోలీసులు యీపాటికి యిల్లు చుట్టేసుండొచ్చు. హడలి పోయి రామం పారిపోతే నేరం మరీ బలపడుతుంది. నేరం వొప్పుకుని న్యాయదేవత కనికరం కోసం పాకులాడితే శిక్ష తగ్గుతుంది. పోలీసులకి తెలియకపోతుందా? గుప్‌చిప్‌గా శవదహనంకూడా చేయించలేకపోయాడు. వంటమనిషి, జానకి మేనమామ, ఇరుగుపొరుగూ, అందరూ రామానికి విరోధులే. ఎటు చూసినా రామం చిక్కుకోడం తథ్యం. అల్లాంటప్పుడు పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కోడం శ్రేయస్కరం.

"పద. ఇంటికి వెళ్దాం" అని రామాన్ని వెంటబెట్టుకు బయలు దేరాడు నీలకంఠం.

ఇల్లు జేరేవేళకి ఇంటిచుట్టూ జనం ఇంట్లో పోలీసులు.

శవపరీక్ష, డాక్టరు సాక్ష్యం, కేసు యథావిధిగా జరిగాయి.

చనిపోయిన స్త్రీ గర్భవిచ్ఛిత్తికి చేసిన ప్రయత్నంలో రామం సాయంచేశాడని రుజువయింది. జానకి చావకపోతే నేరం ఇంత పెద్దదయేది కాదు. రామం నిర్దోషి అని నమ్మే అవకాశం లేకపోవడంవల్ల, మూడేళ్ళు శిక్ష పడింది కోర్టువారు తీర్పు చెప్పాక నీలకంఠం రామం భుజంతట్టి, "జీవితం చాలా విశాలమయింది. నువ్వింకా చిన్నవాడివి. గడిచింది మొదటి వసంతమే. తీపిలో వగరుంటుంది. ప్రేమను నమ్మినవాడికి వోటమిలేదు. వేడిరక్తం నీ కర్తవ్యాన్ని మరిపింపచేసింది నీతండ్రి జానకిలాంటి పిల్లను నీకు పెళ్ళిచేసివుంటే, మీ జీవితాలింత కల్మషపూరిత మయ్యేవికావు. పాప పరిహారంకోసం యీ మూడేళ్ళ శిక్షా అనుభవించి బయటికిరా. పునీతుడ వవుతావు. జీవితంనుంచి నీలాంటి యువకుడు పిరికిపందలా పారిపోగూడదు. మూడేళ్ళ అనంతరం నువ్వు బయటకొచ్చేవేళకు ఈ ప్రపంచం నూతనోత్సాహంతో నీకై చేతులుజాపుతుంది. నువ్విప్పుడు నమ్మలేవుగాని నేను నిన్ను రక్షించా" అన్నాడు.

ఆ రక్షించడ మేమిటో రామానికి అర్థంకాలేదు. అతను తలవాల్చాడు. జానకి రామంహృదయంలో జీవించింది. జైలు కటకటాలు మూసుకున్నాయి.